# అడ్డాలనాడు

గౌరయ్య తన జీవితంలో యాభైఐదు గ్రీష్మాలనే చూసాడు. యాభైఐదు తర్వాతైనా వసంతాన్ని చూడగలనేమోనని ఆశపడ్డాడు. రెక్కలు ముక్కలు చేసుకున్నాడు. బొక్కలు కలికలికాగా కష్టించాడు. కాని అతడూహించినట్టుగా యాభైఐదు తర్వాత కూడా అతని జీవితంలో వసంతం తొంగిచూడలేదు. ఇక తొంగి చూస్తుందన్న ఆశ కూడా లేదు. అయినా అత డెవరిపైనా ద్వేషాన్ని పెంచుకోలేదు. అరవై ఏండ్లు మీదపడి వృద్ధాప్యం వచ్చి ఇన్నేళ్ళ అవిరామ శ్రమవల్ల శరీరం అలసిపోయి నడుం వంగినా, వెంట్రుకలు తెల్లబడ్డా, పళ్ళూడినా తన కాళ్ళపై తానే బ్రతుకుతున్నాడు. తాను జీవితాశయంగా భావించిన కార్యాన్ని ఎన్ని ఒడుదొడుకులొచ్చినా, ఏటికి ఎదురీదడంలా భావించైనా సరే, పూర్తి చేశాడు. అందువల్ల తా నాశించిన సుఖం తనకు లభించనందుకు గౌరయ్య కొంత బాధపడ్డా మామూలుగానే జీవితం గడుపుతున్నాడు.

ఉదయం లేస్తూనే గౌరయ్య ఊరవతల కాలువ దిక్కు దొడ్డికి పోయొచ్చి, గొంగళి భుజంపై వేసుకుంటాడు. కుడి చేత్తో 'కలప' చేతబట్టుకొని ఎడమచేత్తో భుజంపై వేలాడే గొంగళిని పట్టుకొని ఊళ్ళోకి పోతాడు. తనకు వాడుకున్న అసాముల ఇంటింటికీ పోయి క్షౌరం చేసి ఏ మధ్యాహ్నానికో ఇంటికి తిరిగొస్తాడు. వస్తూనే బావి దగ్గర కెళ్ళి బొక్కెన్లో నీళ్ళు చేదుకొని, పిడుక బొగ్గుతో పండ్లు తోముకొని ముఖం కడుక్కుంటాడు. అప్పుడే నాలుగైదు బొక్కెండ్ల నీళ్ళు చేదుకొని గబగబా తలపై నుండి పోసుకొని స్నానం అయిందనిపించుకుంటాడు. వెంటనే ఇంట్లో కెళ్ళి గొంగళి ముద్దగా నేలపైవేసి దానిపై కూర్చుంటాడు. లసుమమ్మ అల్యూమినియం గిన్నెలో వేసుకొచ్చిన అన్నం తింటాడు. మూతి తుడుచుకుంటూనే చెలుకల కావలికని బయటి కెళ్తాడు. మళ్ళీ ఇంటికి రావడం రాత్రి ఏ తొమ్మిది పదిగంటల సమయానికో. వచ్చి అన్నం తిన్నాననిపించుకొని, అదే గొంగళి నులక మంచంలో వేసుకొని పక్క ఒత్తుకుపోగా పడుకుంటాడు. ఇది గౌరయ్య దినచర్య. సాధారణంగా గౌరయ్య దినచర్యలో మార్పుండదు.

జబ్బపై నుండి వెనుకకు వేలాడే గొంగళిని ఎడమచేత్తో పట్టుకొని కుడిచేతిలో తోలు కలప పట్టుకొని వంగుతూ నడుస్తున్నాడు గౌరయ్య. నిన్న చెలుకలోకి వచ్చే దొంగ పశువులతో అటూ ఇటూ పరుగెత్తి అలసిపోయాడు. కాళ్ళు విపరీతంగా గుంజుతున్నాయి. పటేలు పిలిచాడు. కాబట్టి త్వరగా క్షౌరం చేయడానికి పోక తప్పడంలేదు. కొంచెం ఆలస్యం అయిందో లేదో పటేలు మనిషిని పంపేడు. ఆ

మనిషి గౌరయ్యపైకి కోపానికొచ్చాడు. అతన్ని చూస్తే ఊళ్ళో చాలా మందికి పొడలే.

"ఏం గౌరయ్యా! ఎటో పోతున్నావు? పలుకరించాడు సాలె రామనర్సు.

"పటేలుకు సవురం సెయ్యాలె." నడుస్తూనే జవాబిచ్చాడు గౌరయ్య.

"పా, నేను అటే వత్తున్న" అని అతనితో నడువసాగాడు రామనర్సు. నడుస్తూ.....

"కొడుకెక్కడున్నడే గౌరన్న?" అన్నాడు.

"ఒరంగల్లు లున్నడు."

"జీతమే పాటత్తంది?"

"రెండు వెయిల్దాక వత్తయనుకుంట."

"నీ కొడుకు గంత పెద్ద నౌకరి సేత్తంటే నువ్వు గీ.. పన్జేసుడేందె? కొడుకేమన్న పైసలు పంపుతండా లేదా?"

రామనర్సు తెలిసే అడుగుతున్నాడో, తెలియకనే అడుగుతున్నాడో గౌరయ్య కర్థం కాలేదు. కొడుకు తనకు డబ్బు పంపినా పంపకున్నా తాను ప్రాణాధికంగా చూసుకొని పెంచి పెద్ద జేసిన కొడుకును ఇతర్ల ముందు తన నోటితో చులకన చేయడం గౌరయ్య కిష్టం లేదు. వాడు సుఖంగా ఉండడమే కావల్సింది అనుకున్నాడు.

"ఎందుకు పంపడుగని ఇంట్ల వట్టిగుండేం జెయ్యాలి? సిన్నప్పట్నుంచి పని కలువాటయిన పానం వట్టిగుండుమంటె ఉంటదా?" అన్నాడు.

గౌరయ్య కొడుక్కు నౌకరయిన తర్వాత తనకొరకు మట్టిలో మన్నై కష్టపడి చదివించిన తల్లితండ్రులను దగ్గరకు కూడా రానివ్వడం లేదని రామనర్సుకు తెలుసు. అయినా, కన్నకొడుకుపై మమకారాన్ని వదులుకోలేక గౌరయ్య నిజాన్ని దాస్తున్నాడని గ్రహించాడు.

"ఎందుకే గౌరన్న, కొడుకును ఎనుకేసుకొత్తవు? కొడుకు పైసలు పంపినంక నువ్వీ వయసులెందుకింత కట్టపడుతవు? నాకు తెవవదనుకుంటన్నవా ఏంది?" అన్నాడు రామనర్సు.

"ఏదో తియ్యలేవు బిడ్డ! ఆడు మంచిగ బతుకుతె సాలదా?"

కొడుకు నేదో అని ముసలివాన్నెందుకు బాధించాలని రామనర్సు "గంతే గంతే, కని సదువుకోని లాబమేందే, నీకున్న గ్యానమన్న సదువుకున్న నీ కొడుక్కు లేకపోయె." అంటూ అతన్నిదాటి వెళ్ళిపోయాడు.

పటేలిల్లు చేరుకొని గౌరయ్య వాకిట్లో మంచంపై కూర్చొని వున్న పటేలును చూసి వంగివున్న నడుమును మరింత వంచి "దండాలు పటేలా" అని నమస్కరించాడు.

"ఆఁఆఁ" అని తలూపి రాంరెడ్డి పటేలు...

"ఏంరా గౌర! ఎంత సేపాయెర నీ దగ్గరికి మనిషిని తోలిచ్చి? గిప్పుడార నువ్వచ్చేదిక? సదువుకున్న కొడుకున్న దనార గ౹ర" అన్నాడు.

"గట్లందు కంటరు దొర? నిన్న రాత్రి సెలుకలల్ల గొడ్లు గోసపుచ్చుకున్నయి. అలిట్టయింది. లేసేటాళ్ళకు కొద్దిగంత పొద్దెక్కింది. నేను వత్తనని తయారయితన్న – మీ మనిషచ్చిండు" అన్నాడు గౌరయ్య.

"సరె సరె. ఏదోటి సెప్పతనే ఉంటవిగ. జెప్పన సవురం జెయ్యి. బస్సచ్చే యాల్లయితంది. ఊరికి పోవాలె" అని మంచంలో నుంచి లేచి నిల్చున్నాడు రాంరెడ్డి.

భుజంపై నున్న గొంగడిని వాకిటిలో కుప్పగా వేసి దాని ప్రక్కనే కలప (మంగలిపొది) పెట్టి అరుగు దగ్గరికి పోయాడు గౌరయ్య.

"పటేలవ్వా! ఒక్క పీటున్ను, గిలాసల కొన్ని నీల్లియ్యండ్రి" అని నిల్చున్నాడు.

ఐదు నిమిషాలు తర్వాత ఒక గ్లాసులో నీళ్ళు, పీట తెచ్చి అరుగుపై పెట్టింది రాంరెడ్డి భార్య. గౌరయ్య వాట్ని తీసుకొచ్చి గొంగడి కెదురుగా పీట వేశాడు. గ్లాసది కుడిచేతివైపుంచుకొని గొంగడపై కూర్చొని కలపమూత తీశాడు. లోపల్నుండో చిన్న తెల్ల గిన్నె తీసి పక్కన పెట్టి అందులో గ్లాసులోని కొన్ని నీళ్ళు పోశాడు. కత్తెరను బయటపెట్టి, కత్తిని తోలు పటకాపై పదును పెట్టాడు. పటేలు అంగీ, బనీను విడిచేసి, గౌరయ్య కెదురుగా పీటపై కూర్చున్నాడు. గౌరయ్య లేచి నిల్చొని గిన్నెలోని నీళ్ళు కొన్ని చేతిలో పోసుకొని వంగి రాంరెడ్డి తలపైపోసి చేత్తో టకటకమని కొట్టాడు. కొంతసేపయిన తర్వాత ఇంకొన్ని నీళ్ళతో తలంతా తడిపాడు. దువ్వెనతో తల దువ్వాడు. కత్తెర చేతిలోకి తీసుకొని కత్తిరించడం మొదలుపెట్టాడు.

"ఏంర గౌర! కొడుకు బాగనే సంపాయిత్తండటకద" అన్నాడు వ్యగ్యంగా, రాంరెడ్డి.

"అఁఅఁ" అన్నాడు ముభావంగా గౌరయ్య.

"కొడుకేమొ పెద్ద నౌకరే సేత్తండు. నువ్వు తలుకాయలు కొరుక్కుంట బతుకుతావుర!"

గౌరయ్య మనసు చివుక్కుమన్నది. తన కొడుకు–తనకు లేని బాధ వీళ్ళకెందుకో అతని కర్థం కాలేదు. సూటి పోటి మాటలతో తనను బాధిస్తూ వాళ్ళు పడే ఆనంద మేమిటో గౌరయ్యకు తోచలేదు. ఏం మాట్లాడకుండా మౌనంగా వున్నాడు.

"మాట్లాడుత లేదేందిర, కొడుకు సదువుకొని నిన్ను టూగుటూయ్యాలలో ఊపుత దనుకున్నవు గాదుర?" రెట్టించాడు రాంరెడ్డి.

"ఏదో పటేలా, గా సంగతు లన్నెందుకు? ఎట్ల బతికెటోడట్ల బతుకుతనే వుంటడు" అన్నాడు గౌరయ్య.

"నే నానాడు సెప్ప తిన్నావుర. పోరనికి పనినేర్పురా అంటే సదివిచ్చి రాజ్జా లేలిపిత్తనంటివి. ముసలోని వయినా పన్జేసుడు తప్పకపాయె. మీ అన్నకొడుకును పనిల పెడితె ఎట్లక్కెర కత్తండో సూడు. అడు కాలుమీన కాలేసుకొని కూసుంటె అన్ని పోరడే సేసుక రావట్టె. ఇగ నీ కొడుకును కట్టపడి సదివిత్తె, నౌకరి దొరికినంక జాడిచ్చి తన్నె. గిప్పుడు బుద్దచ్చిందా? నేం జెప్పిన మాటలు గిప్పుడన్న యాదికత్తన్నయా లేదా?" అన్నాడు రాంరెడ్డి.

రాంరెడ్డి మాటలు తగులరాని చోట తగిలాయి గౌరయ్యకు. ఆ రోజు సహాయం కొరకై పటేలు దగ్గరికెళితే, చదువు మాన్పి, కులవృత్తి నేర్పమని సలహా ఇచ్చాడు. ఆ సలహా తన కుటుంబానుద్ధరించడానిక్కాదని, అసూయతో చెప్పిందని గౌరయ్యకు తెలుసు. అతని సలహాకు విరుద్ధంగా తాను కొడుకును చదివించినందుకు, ఆ కొడుకు తనగ్గాకుండా పోయినందుకు పటేలు ఎత్తిపొడుస్తున్నాడని గ్రహించాడు. గౌరయ్య ముఖంలో అంతులేని ఆవేదన. బాధ నణుచుకుంటూ మౌనంగా తన పని తాను కానిస్తున్నాడు. ఒకసారి తల పైకెత్తి, విచారంగా వున్న గౌరయ్య ముఖం చూసి ఏమనుకున్నాడో రాంరెడ్డి మౌనం వహించాడు.

కొడుకు చదువుకొరకు తాను పడ్డ తపన.... పాట్లు.... ఆవేదన.... గుర్తుకొచ్చాయి గౌరయ్యకు. మనసు గతంలో కెళ్ళింది.

☆ ☆ ☆

తండ్రి సంపాదించి నాస్తేం లేకపోవడంతో రెక్కల కష్టంతోనే జీవితాన్ని ప్రారంభించాడు గౌరయ్య. కులవృత్తితోను మిగతా సమయాల్లో కూలి పనులు చేస్తూ జీవయాత్ర సాగిస్తున్నాడు. పదిహేనవ ఏట లసుమమ్మ అతని జీవితంలో ప్రవేశించింది. మరో ఐదేళ్ళ తర్వాత వదినకూ, తన భార్యకు పడకపోవడంతో వేరు కాపురం పెట్టాడు గౌరయ్య. క్షౌరాలు చేయడం.... ఊళ్లో శుభకార్యాలయితే పనులు చేయడం... యజమానులు పంపిన ఊళ్లకు పయనం పోవడం... ఇచ్చింది పుచ్చుకోవడం.... తిడితే మౌనంగా భరించడం... అవమానాలను సహించడం... అప్పుడప్పుడు కూలి పనులు చేయడం.... ఇవి గౌరయ్య జీవితంలోని భాగాలు. గౌరయ్య భార్య అతని తల్లితో పోయి, కాన్పులు చేయించడం నేర్చుకొని మంత్రసానయింది. దానికితోడు కూలిపనులు కూడా చేసేది. ఇద్దరు పనిచేసినా సంపాదన అంతంత మాత్రమే. వాటికితోడు తిట్లను, అవమానాలను భరించాలి.

ఇలా పదేళ్ళు గడిచాయి. ముగ్గురు కూతుర్లు కలిగారు నాలుగో సంతానంగా కొడుకు పుట్టాడు. ఆ రోజు గౌరయ్య పొందిన సంతోషం వర్ణణాతీతం. అతడారోజే ఓ దృఢ నిర్ణయం చేసుకున్నాడు.

తనలాగా తన కొడుకు జీవితంలో అవమానాలు పడకూడదు. అరే తారేలతో పిలువబడకూడదు. గౌరవంగా, దొరకొడుకులా, దర్జాగా బ్రతకాలి. కాని తనవద్ద ఆస్తిపాస్తులు లేవు. అయితే ఏం చేయాలి? బాగా ఆలోచించాడు గౌరయ్య. ఎంతో మంది తక్కువ కులాలవాళ్ళు చదువుకొని పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయడం చూస్తున్నాడు. తన కోర్కె నెరవేరాలంటే కొడుకును చదివించడ మొకటే మార్గం. ఎంత కష్టపడైనాసరే కొడుకును చదివించాలి. అందరు చూసి అసూయపడేలా చదివించాలి. ఈ ప్రయత్నంలో తన జీవితం ముగిసినా పర్వాలేదు అని నిర్ణయించుకున్నాడు. తన ఆలోచన భార్యతోను చెప్పి ఒప్పించాడు. కొడుక్కు అందరిలా కాకుండా 'వినోద్' అనే పేరు పెట్టుకున్నారు. అతన్ని చదివించడమో యజ్ఞంగా భావించారా దంపతులు.

సెంటు భూమీ ఏ ఆస్తీ లేని గౌరయ్య వినోద్‌కు ఐదేళ్ళు నిండగానే ఊళ్ళో

ఉన్న బడిలో చేర్పించాడు. ఎలా చదివిస్తావని ఎంత మంది వ్యంగ్యంగా మాట్లాడినా లెక్క చేయలేదు. "ఊళ్లో ఉన్న పది వరకు చదివిస్తాడులే, అంతకంటెనా?" అని ఊరి వాళ్లనుకున్నారు. కొందరు ప్రోత్సహించారు. తాము చింపుల బట్టలు తొడుక్కున్నా చదువుకునే కొడుకు వినోద్‌కు తను శక్తి వున్నంత వరకు మంచి బట్టలే కొనేవారు. తాము, ఆడపిల్లలు జొన్నన్నం తిన్నా అతడికి వరన్నం వండి పెట్టేవారు. కొడుకును అల్లారు ముద్దుగా చూసుకునేవారు. కొడుక్కు చిన్న జబ్బు చేసినా నానా హడావిపడి ఊళ్లోవున్న ఆర్.ఎం.పి. డాక్టర్ కాళ్ళు పట్టుకునైనాసరే తీసుకొచ్చేవారు. తమ జబ్బుకు మాత్రం ఒక్క పైసా ఖర్చు చేసేవారుకారు. తాము రాత్రింబవళ్ళు కష్టమైన పనిచేసినా కొడుకును ఎండకు తిరుగొద్దని చెప్పేవారు. "బిడ్డా, ఎవ్వలి జోలికి పోకు ఎండల తిరిగి శరీరం పాడు చేసుకోకు" అని ఒళ్ళో కూచోబెట్టుకొని చెప్పేవారు. పది పన్నెండేళ్ళు వరకు కూడా దగ్గర కూచోపెట్టుకొని అన్నం తినిపించేవారు. కొసరి కొసరి పెట్టేవారు. ఏ ఒక్కరోజు కొంచెం తక్కువ తిన్నా దిష్టి తగిలిందని తీసేవారు. పరీక్ష ఫీజు, టర్మ్ ఫీజులు కట్టాల్సి వస్తే ఎవరి కాళ్ళో పట్టుకొని వెంటనే తెచ్చిచ్చేవారు. కొడుకుపై ఆ దంపతులకున్న అప్యాయతను చూసి కొందరు హేళన చేసేవారు; మరికొందరి కళ్ళు చెమర్చేవి. ఎవ్వరేమనుకున్నా కొడుకును విద్యావంతున్ని చేయడమే ఓ తపస్సుగా భావించి తమ పని నెరవేర్చే వారా దంపతులు. వినోద్‌ను ప్రాణాధికంగా చూసుకుంటూ, కొడుకు సుఖమే తమ సుఖంగా, అతని బాధే తమ బాధగా తలుచుకుంటూ ఎస్.ఎస్.సి. వరకు చదివించారు.

వినోద్ ఎస్.ఎస్.సి. ప్రథమశ్రేణిలో పాసయ్యాడు. ఈలోగా గౌరయ్య ముగ్గురు కూతుర్లను గంతకు తగ్గ బొంతలను వెదికి పెళ్లిళ్లు చేసాడు. కొడుకును చదివించడమొక్కటే ఇప్పుడతని ధ్యేయం. ఇన్ని రోజులు ఊళ్లో పాఠశాలవడంవల్ల అంతగా ఖర్చు కాలేదు. ఇప్పట్నుంచి పై ఊరికి పంపాలి. ఖర్చు అధికంగానే ఉంటుందని తెలుసుకున్నాడు గౌరయ్య. అయినా సరే, కొడుకును చదివించడానికే నిర్ణయించుకున్నాడు. కొడుకునింటర్లో చేర్పించే సమయంలో ఒకేసారి మూడు వందల రూపాయలవసరం పడి రాంరెడ్డి నడుగుదామని పోయాడు గౌరయ్య. విషయం చెప్పి డబ్బడిగాడు.

క్షౌరం చేస్తూ బ్రతికే గౌరయ్య కొడుకు కాలేజి చదువుకు పోవడం నచ్చలేదు రాంరెడ్డికి. పోగా వినోద్ గౌరయ్యలాగా కాకుండా తన లాంటి పెద్దల నంతగా లక్ష్యపెట్టడు. అలాంటివానికి డబ్బివ్వదలచుకోలేదు రాంరెడ్డి.

"గౌరా! కాలేజీ సదువులంటె మాటలార. ఇన్ని రోజులంటె ఊళ్లబడుంది. సదవించినవు. ఇప్పుడు వేలకు వేలేన్నుంచి తెత్తవు? సదివించిన కాడికి సాలుగని బందు సెయ్యిగ" అని సలహా ఇచ్చాడు.

"కాదు పటేల, ఎట్లనో ఎల్లదీసుకుంటగని, ఇప్పుడో మూడు నూర్లియ్యండ్రి. జెప్పన్నే మల్ల ఇత్త. నా కట్టమేదో నేంబడుత."

"నేం జెప్పాలినత్త లేదార. ఇప్పుడు పీసుకే బాకీల్చేత్తె అటెను కేడదెత్తవు?

కష్టపడి సదివిత్తె అడు నీ తలపుండ్లు కడుగుతాడ్ర. సదువుకున్నోళ్లని నమ్మద్దు. అటెనుక రెక్కలచ్చిన పచ్చోలె ఎగిరిపోతే గప్పడుగని ఏర్పడది. పైసల్లేవేంలేవు పో" అని గర్జించాడు, రాంరెడ్డి.

గౌరయ్యెంత బతిమిలాడినా రాంరెడ్డి డబ్బివ్వలేదు. రాంరెడ్డి ఎన్ని విధాల ప్రయత్నించినా గౌరయ్య కొడుకును చదివించడానికే పూనుకున్నాడు. మరో వ్యక్తి దగ్గర డబ్బు తెచ్చి కొడుకును కాలేజీలో చేర్పించాడు.

కొడుకును కాలేజీలో చేర్పించిన తర్వాత గౌరయ్య, లసుమమ్మ మునుపటి కంటె ఎక్కువగా కష్టపడాల్సి వచ్చింది. ఇద్దరూ తమ వృత్తి పనులే కాకుండా ఏ చిల్లర పని దొరికినా అది అవిరామంగా చేశారు. వాళ్ళ ఆశలన్నీ కొడుకుపైనే పెట్టుకొని అతన్ని చదివించడమే తమ ధ్యేయంగా భావించారు. పట్నంలో చదువుతున్న కొడుక్కు మంచిగా తిండి పెట్టాలని పట్నం పోయేవాళ్ళతో పెరుగడిగి పంపేవారు. శుభకార్యాల్లో తమకు దొరికిన మాంసాన్ని శుభ్రంగా వుంచి, కొడుక్కి పంపేవారు. కొడుకు ఖర్చుల కొరకు ఎవరి కాళ్ళో వేళ్ళో పట్టుకొని సమయానికి డబ్బు తెచ్చి పంపిస్తూ, అవి తీర్చడానికి నానా కష్టాలు పడేవారు. చదువుకున్నవాళ్ళకు చదువుగూర్చి ఎప్పుడూ ఆలోచనగా వుంటుందని కథ చెప్పేవారు.

"ఒక తల్లి కిద్దరు కొడుకులు. అందులో ఒకతను వ్యవసాయప్పని చేసేవాడు. రెండో వాడు చదువుకొనేవాడు. ఇద్దర్లో ఎవరి కెక్కోరంది (నిరంతర ఆలోచన) ఉంటుందో తెలుసుకోవాలని ఆమెకొక ఆలోచన కల్గింది. నోరు తెరిచుకుని నిద్రబోతున్న ఇద్దరి కొడుకుల నోట్లో వెన్న ముద్ద పెట్టింది. చదువుకున్న వాడి నోట్లో వెన్న వెంటనే కరిగిపోయింది. నిద్రలో కూడా అతనికి ఆలోచనుండడంవల్ల ఇది జరిగిందని ఆ తల్లి గ్రహించింది." ఈ కథ నిజమైనా కాకున్నా చదువుకుంటున్న కొడుకుపై ఉన్న ప్రేమను తెలుపుతుందిది. కొడుకు ఇంటి కొచ్చినప్పుడు మరింత ఆప్యాయంగా చూసుకునేవారు.

వినోద్ ఇంటర్లో కూడా ప్రథమశ్రేణిలో పాసయ్యాడు. ఇంజనీరింగ్ చదువుతానన్నాడు. కొంతమంది కష్టపడైనా చదివియ్యమని గౌరయ్యకు సలహా ఇచ్చారు. తన కొడుకు ఇంజనీర్ అవుతానంటే ఏ కన్నవారి హృదయం ఉప్పొంగదు? గౌరయ్య దంపతులు హృదయం సంతోషంతో పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది. ఎన్ని కష్టా లెదురైనా చదివించడానికే నిర్ణయించుకున్నారు. ఇంజనీరింగ్‌లో సీటు దొరికింది. భార్యపై వున్న తులం బంగారంతో సహా అన్నీ అమ్మాడు గౌరయ్య. ఊళ్ళో ఉన్న పెంకుటిల్లు నమ్మి ఊరి బయట బంజరు భూమిలో గుడిసె వేసుకున్నాడు. కొడుకు బి.ఇ. చదువు పూర్తయే సరికి రెండు వేలప్పు, నిరంతర శ్రమ వల్ల అలసి కృశించి అస్థిపంజరంలా తయారైన ఎముకల గూడు, గుడిసె కప్పుకోలేని నిస్సహాయత మిగిలాయి. అయినా గౌరయ్య బాధపడలేదు. కొడుకును ఇంజనీర్ చేసినందుకు గర్వించాడు. చదువు పూర్తి చేసుకొని తిరిగొచ్చిన కొడుకు నాప్యాయంగా కౌగలించుకున్నాడు.

☆ ☆ ☆

కొడుకును గూర్చి ఆలోచిస్తూ క్షౌరం చేస్తున్న గౌరయ్య కళ్ళ వెంబడి పటపట నీళ్ళుకారి రాంరెడ్డి ముఖంపై పడ్డాయి. ముఖం పైకెత్తి చూసిన రాంరెడ్డి గౌరయ్య ముఖం చూసి వచ్చే కోపాన్నణుచుకున్నాడు.

"కొడుకు యాది కచ్చినాడ్ర, ఏడుత్తన్నవు?" అన్నాడు.

"అవు పటేలా" అని కళ్ళ నీళ్ళు తుడుచుకున్నాడు గౌరయ్య.

తన పని పూర్తిచేసి వెళ్ళిపోయాడు.

☆ ☆ ☆

కాలేజీలో చేరిన తర్వాత, బి.ఇ. లో చేరిన తర్వాత మరీ ఎక్కువగా వినోద్‌లో మార్పొచ్చింది. 'వీనవ్వా' అంటూ ఆప్యాయంగా పలిస్తే, అది మోటుగా భావించి చీదరించుకునేవాడు. ఉన్నవాళ్ళతో స్నేహాలు పెరిగాయి. తన కులం వాళ్ళతో మాట్లాడటానికి వెనుకాడేవాడు. దొరలు, పటేండ్ల పిల్లలతో స్నేహం పెరిగింది. చదువుకున్న కొడుక్కు పెద్దోల స్నేహాలే వుంటాయనుకున్నాడు గౌరయ్య. బి.ఇ. పూర్తి చేసుకొని వచ్చిన వినోద్‌లో మరీ మార్పొచ్చింది. అతనికి గుడిసెలోని దుర్భర దారిద్ర్యం అసహ్యంగా అగుపడుతుంది. క్షవరాలు, కాన్పులు, కూలి పనులు చేస్తూ బ్రతికే తల్లిదండ్రులు మురికిగా అగుపిస్తున్నా రతనికి. వాళ్ళ జీవితాలే మట్టి జీవితాలుగా తోస్తున్నవి. కాని ఆ మట్టినుంచే తాను మాణిక్యంగా మారాడన్న ఆలోచన అతనికి లేదు. తనను మాణిక్యంగా మార్చడానికి ఆ మట్టి మనుష్యులెన్ని కడవల చెమటను కార్చారో, తమ జీవితాల నెలా పణంగా పెట్టారో అత డాలోచించడం లేదు. తన కాలేజీ రంగు రంగుల జీవితం, అక్కడ కొందరు గడిపే విలాసమయ జీవితాలు అతనికి జ్ఞాపకమొస్తున్నాయి. ఆడవాళ్ళతో స్నేహాలు చేస్తూ తిరగడాలు, సినిమాలు, షికార్లు; కార్లున్న మిత్రులతో మిత్రత్వాలు కనబడుతున్నాయి. తనకు కాలేజీ జీవితంలో కొందరిలా సుఖం లభించనందుకు తన అదృష్టాన్ని తిట్టుకున్నాడు కూడా. అయినా అతడో అమ్మాయితో 'లవ్' సాగించాడు కూడా. ఇప్పుడతడు తనకుద్యోగం రాగానే తన లవ్ నీరజను పెళ్ళాడి మట్టి జీవితానికి స్వస్తి పలుకాలని కూడా ఆలోచిస్తున్నాడు. కాలేజిలో చదివేటప్పుడు పట్టణ జీవితాన్ని కలవాటుపడ్డ వినోద్ ఊళ్ళో ఉన్నంత కాలం ముండ్లపై ఉన్నట్లు భావిస్తున్నాడు. కొడుకులో వచ్చిన మార్పును గౌరయ్య గమనించకపోలేదు. ఉద్యోగం దొరికితే వాడే సరియౌతాడని ఊహించాడతను.

చదువయినంక నాలుగైదు నెలలకు వినోద్‌కుద్యోగం వచ్చింది. ఆరోజు గౌరయ్య అనుభవించిన ఆనందం జీవితంలో ఎప్పుడూ పొందలేదు. ఊళ్లో కురికి కనిపించినవారికల్లా చెప్పాడు తన కొడుకు కింజనీరయ్యాడని. తన ఏభైఏదేళ్ళ కష్టపూరిత జీవితానికి కొడుకు అంతిమగీతం పాడుతాడని గౌరయ్య సంతోషించాడు. కొడుకు చీదరించుకుంటున్నా ఎన్నో జాగ్రత్తలు చెప్పి దీవించి పంపాడు.

ఉద్యోగం దొరికిన నాలుగైదు నెలల వరకు ఇంటి ముఖం చూల్లేదు వినోద్. గౌరయ్య రమ్మని ఉత్తరం రాయిస్తే రావడానికి వీలుపడడం లేదని రాసేవాడు. తుదకో రోజు మెరుపు తీగలా వున్న ఓ అమ్మాయిని వెంటబెట్టుకొని బస్సుదిగాడు

వినోద్. వినోద్‌తో ఆ అమ్మాయిని చూసిన ఊరి జనం ఆశ్చర్యపోయారు. ఆమెను తన భార్యగా పరిచయం చేశాడు. ఆ మాట విన్న గౌరయ్య, లసుమమ్మ హృదయాలపై సుత్తితో బాధినట్లయింది. హృదయం పరిపరి విధాలుగా పరితపించి విలవిల లాడిపోయారు. తమ చేతులతో పూవులా పెంచి పెద్ద చేసి, అతని బాగోగులే జీవిత ధ్యేయంగా భావించిన తల్లిదండ్రులు ఆ కొడుకే కనీసం తమకు తెలవకుండా పెళ్ళి చేసుకుంటే ఎంత వేదన అనుభవిస్తారు?..... బాధపడ్డా తన కొడుకు ప్రక్కన మెరుపుతీగలా ఉన్న దొరసాని లాంటమ్మాయిని చూసి కొంత మురిసిపోయారు కూడా కాని వినోద్, అతని భార్య ఆ గుడిసెలో ఎక్కువ కాలముండటానికి ఇష్టపడలేదు. యాంత్రికంగా మాట్లాడిన కొడుకును చూసి కొడుకు చేయి జారి పోతున్నాడా అనుకున్నాడు గౌరయ్య. ఎంత బ్రతిమలాడినా వినకుండా ఆ సాయంత్రమే పోతానన్నాడు వినోద్. డబ్బు విషయ మడుగుదామనుకున్నా రాక రాక వచ్చిన కొడుకును కొత్త కోడలు ముందెందు కడగాలని ఊర్కున్నాడు గౌరయ్య. పోయేటప్పుడు తండ్రి చేతిలో భిక్షలా 500 రూపాయలు పెట్టి పోయాడు వినోద్.

వినోద్ విలాసమయ జీవితాన్ని మరిగాడు. తాను, భార్య తప్ప ఇప్పుడతని కెవరూ అగుపడటం లేదు. సర్వస్వాన్ని ధారబోసి తనకో స్థితి కలిగించిన తండ్రి, తల్లి అతని కగుపడటం లేదు. కుటుంబాన్ని పట్టించుకుంటే తాను జీవితంలో సుఖపడలేననుకున్నాడు. మొదట్నుంచీ కష్టం చేస్తూ బ్రతికిన తల్లిదండ్రులలాగే బ్రతుకుతా రనుకొన్నాడు. భార్య బోధన మరింత మార్చిందతన్ని. తానిప్పుడు ఇంజనీర్, సంఘంలో గౌరవం కలవాడు. తన దగ్గరి కెంతోమంది పెద్దవాళ్లొస్తారు. అలాంటి తన పరిస్థితి ఇంటి దగ్గర హీనంగా వుందని తెలియనీయకూడ దనుకున్నాడు. తల్లిదండ్రులకు దూరంగా ఉండటానికే నిర్ణయించుకున్నాడు. ఆర్నెల్లయినా కొడుకునుంచి ఏ సమాచారమూ లేకపోయేసరికి గౌరయ్య నానా తిప్పలు పడి నాగార్జున సాగర్ పోయాడు. కొడుకిల్లు కనుక్కోవడానికి చాలా కష్టపడ్డాడు. కొడుకింట్లో అడుగు పెట్టిన గౌరయ్య స్వర్గంలో అడుగు పెట్టినట్టు భావించాడు. అధునాతన ఫర్నీచర్‌తో కళ్ళు మిరుమిట్లు గొలిపేలా అలంకరింపబడున్న కొడుకు ఇల్లునూ, మురికి కూపంలాంటి తన చిల్లుల గుడిసెనూ పోల్చుకొని ఆశ్చర్యపోయాడు. అందుకే కొడుకు ఆ ఇంట్లో ఉండలేక పోయాడని సమాధాన పర్చుకున్నాడు. గౌరయ్యను తమ ఇంట్లో చూసిన వినోద్, నీరజల భ్రుకుటులు ముడివడ్డాయి.

“నాన్నా! నేనొచ్చేవాన్ని కదా, నువ్వెందు కొచ్చా విక్కడికి” అన్నాడు వినోద్.

“ఆర్నెల్లయి మనసాగక వచ్చిన. నీ చదువుకు చేసిన అప్పు అట్లానే వుంది. ఒక్క పైసన్న పంపక పోతివి” అన్నాడు గౌరయ్య.

“నాన్నా! నా చదువు కప్పయిందా? యాడాదికి 1200/- స్కాలర్‌షిపొచ్చింది. ఇంకా అప్పయిందా? నాకొచ్చే జీతం నా ఖర్చులకే సరిపోతలేదు. ఒకవేళ అప్పుంటె మెల్ల మెల్లగా తీరుస్తాను” అన్నాడు వినోద్.

కొడుకు మాటలతో సగం చచ్చాడు గౌరయ్య.

"నీకు గంత జీతం సాలకుంటె ఇల్లెట్ల గడవాలి? పోనియ్యి, అప్పులన్న కట్టు, మా చందాన మేమెట్లనో బతుకుతం."

"నాన్నా! నాకు తెలవదా చెప్పు? మిగుల్తె మా పంపుత. కాని డబ్బు కొరకు నన్ను బలవంతం చేయొద్దు. నువ్విక్కడకు రాకు. నేనే అక్కడకొస్తా" అని తండ్రి చేతిలో 500/- పెట్టి బస్సెక్కించాడు.

గౌరయ్య ఇంట్లో ఉన్నంతసేపూ అతన్ని బయటకు వెళ్లనీయలేదు. అతన్ని చూస్తే తమ గౌరవం పోతుందన్న భయం వాళ్లకు.

తర్వాత వినోద్‌కు వరంగల్ ట్రాన్స్‌ఫరయింది. 1500/- ఉన్న జీతం పెరిగింది, కాని గౌరయ్య పరిస్థితి మారలేదు. బలవంతంగా బాకీ తీర్చాడు వినోద్. ఏ ఆర్నెల్లకో వచ్చి 200/-, 300/- ఇచ్చేవాడు. రెండేళ్ళనుంచి అవి ఇవ్వడంకూడా మానుకున్నాడు. అరవై ఏళ్ళు నిండినా గౌరయ్యకు రెక్కలకష్టం తప్పలేదు.

మంచంలో పడుకొని కొడుకుగూర్చి ఆలోచిస్తున్న గౌరయ్య కళ్ళు చెమ్మగిల్లాయి.

కష్టాల్లో పుట్టి కష్టాల్లో పెరిగిన తనకు ఊపిరున్నంతవరకు రెక్కల కష్టం చేయడం కష్టం కాదనుకున్నాడు గౌరయ్య. తాను కష్టపడి చదివించిన కొడుకు పైకొచ్చాడు. తనకంతే చాలు. తన కతడేమి పనికి రాకున్నా చదివించినందుకు పశ్చాత్తాప పడటంలేదు గౌరయ్య. కొడుకు సుఖంగా ఉంటే తన కడుపు నిండినట్టే అనుకున్నాడు.

శాస్త్రి చెప్పిన "అడ్డాలనాడే బిడ్డలు కాని, గడ్డాలనాడా?" అన్న మాటలు జ్ఞాపకమొచ్చి తనను తాను సంతృప్తి పరుచుకున్నాడు గౌరయ్య.

● ఆంధ్రసచిత్ర వారపత్రిక, *14-20 జూన్, 1985.* ●

★ ★ ★